క్లుప్తంగా

గ్రామానికి 10 ఎకరాల చొప్పున భూమిని కేటాయించాలి



కామారెడ్డి టౌన్: ఈత మొక్కలు పెంచడానికి ప్రతి గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. అర్హులైన వారికి టీటీఎఫ్ లైసెన్స్‌లు, గుర్తింపు కార్డులు, పెన్షన్‌ను మంజూరు చేయాలని కోరారు. అక్రమ మద్యం, బెల్టుషాపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాగౌడ్, శంకర్‌గౌడ్, సాయాగౌడ్, రవీందర్, రమేష్, హన్మాగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం



భిక్కనూరు: తిప్పాపూర్‌లో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి సన్నిధానానికి ధర్మరావుపేటకు చెందిన సుచిత- ప్రశాంత్‌రెడ్డి దంపతులు రూ.16,116 విరాళంగా అందజేశారు. అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు ఈ సందర్భంగా సత్కరించారు. తిప్పాపూర్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు ఎనుగు రమేశ్‌రెడ్డి, ప్రతినిధులు ద్యావర సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనుబాబు, రవీందర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలి

ఎల్లారెడ్డి: విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని ఎల్లారెడ్డి డెవలప్‌మెంట్ ఫోరమ్(వైడీఎఫ్) నాయకులు వినోద్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు వైడీఎఫ్ తరఫున స్పోర్ట్స్ కిట్, స్కూల్ బ్యాగులు, నోటుబుక్కులను అందించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైడీఎఫ్ సభ్యులు వెంకటరమణ, చక్రధర్ తదితరులున్నారు.

'బిల్లులు వెంటనే చెల్లిస్తున్నాం'



బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులు బిల్లులు మూడు దశల్లో వెంటనే చెల్లిస్తున్నాం.. కట్టుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం, కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జునప్ప షెట్కార్ అన్నారు. సోమవారం బిచ్కుందలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇసుక ఉచితంగా అందిస్తున్నాం.. ట్రాక్టర్ కిరాయి మాట్లాడుకొని మంజీరా నుంచి తెచ్చుకోవాలని కోరారు. నాయకులు గంగాధర్, అశోక్, సాహిల్ షెట్కార్, సీమ గంగారాం, చింతల హన్మాండ్లు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి



కామారెడ్డి టౌన్: చిన్నమల్లారెడ్డి గ్రామంలో సోమవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు విద్యుశాఖ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

పింఛన్ రూ.6 వేలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా పార్టీల నాయకులు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టో హామీ దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత సూర్యవంశీ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, బాలరాజ్‌గౌడ్, సామేల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన మరమ్మతులు..!

- గోపాల్‌పేటలోని ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతులు ఆగుతూ సాగుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



స్లాబ్ తొలగించిన గోపాల్‌పేట్ ఆర్టీసీ బస్టాండ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట ఆర్టీసీ బస్టాండ్‌కు చేపట్టిన మరమ్మతుల పరిస్థితి. బస్టాండ్ మరమ్మతులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నిధులు మంజూరు చేయిస్తే ఆ నిధులను వినియోగించి పనులు చేపట్టడంతో అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ చూపుతున్న నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోంది. 4 నెలల క్రితం బస్టాండ్ మరమ్మతులకు నిధులు మంజూరవగా నేటికీ బస్టాండ్ పైకప్పు కూల్చివేత పనులే కొనసాగుతున్నాయి. దీనికితోడు మండలకేంద్రంలో జాతీయ రహదారి ఏర్పాటు పనులు కొనసాగుతుండడంతో బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు నిలువ నీడ కరువై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చాలాకాలంగా నెలకొన్న సమస్య...

గోపాల్‌పేటలో 1992లో అప్పటి ఎమ్మెల్యే నేరేళ్ల ఆంజనేయులు చేతులమీదుగా ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభించారు. ప్రస్తుతం బస్టాండ్ శిథిలావస్థకు చేరి ప్రయాణిలకు నిలువనీడ లేకుండా మారింది. బస్టాండ్‌లో పైకప్పు నుంచి పెచ్చులూడి పడటంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పందించి మరమ్మతులకు రూ.33లక్షల నిధులను మంజూరు చేయించారు.గతేడాది డిసెంబర్‌లో బస్టాండ్ మరమ్మతులకు ఆర్టీసీ నుంచి నిధుల కేటాయింపు జరిగింది.

చేపట్టాల్సిన పనులు ఇవే..

బస్టాండ్ పైనున్న స్లాబ్‌ను కూల్చేసి నూతనంగా స్లాబ్ వేయాల్సి ఉంది. టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లో ఫ్లోరింగ్ వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలి. బస్టాండ్ ఆవరణలో బోరుబావిని తవ్వించాల్సి ఉంది. అధికారులు చొరవచూసి బస్టాండ్ మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కొరుతున్నారు.

వేగవంతమయ్యేలా చూస్తాం

గోపాల్‌పేటలోని ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనులు వేగవంతమయ్యేలా చూస్తాం. బస్టాండ్ పైకప్పు కూల్చి నూతనంగా స్లాబ్ వేయాల్సి ఉంది. దీంతోపాటు బస్టాండ్ ఆవరణలో బోరుబావిని తవ్వించడం, టాయ్‌లెట్స్ వసతి కల్పించడం, విద్యుత్ సదుపాయం కల్పించడం, బస్టాండ్‌లో ఫ్లోరింగ్ చేయించాల్సి ఉంది. పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రయాణీకులకు బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం.

– శ్రీకాంత్, ఆర్టీసీ సివిల్ ఇంజినీర్, నిజామాబాద్

ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



బాలికల వసతి గృహ భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి



మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తింటున్న ఎమ్మెల్యే

వర్ని : ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారంలో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. వర్ని మండలం కోటయ్య క్యాంపులో ఎస్సీ బాలికల వసతి గృహం, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, సత్యనారాయణపురంలోని బాలికల హైస్కూల్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులు, సరుకుల నిల్వ, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం వర్ని మండల కేంద్రంలో చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పనిని బట్టి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఎంఈవో సాయిలు, ఏఎంసీ చైర్మన్ సురేశ్ బాబా, పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ తదితరులున్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

రుద్రూర్ : విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) శివారులో గల మోడల్ స్కూల్ ను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లో వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తిన్నారు. పాఠశాల సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన పరికరాలు సిద్ధంగా ఉన్నందున వెంటనే బిగించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పాఠశాల ప్రిన్సిపాల్ చెన్నప్ప, వర్ని ఎంఈవో సాయన్న, ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, పాఠశాల అధ్యాపకులు, స్థానిక నాయకులు ఉన్నారు.


కుక్కల బెడద లేకుండా చేయండి



బ్రాహ్మణపల్లి శివారులో సంచరిస్తున్న కుక్కలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు ఎర్రాపహాడ్, దేమికలాన్, క్రిష్ణాజీవాడి, కరడ్‌పల్లి, బ్రాహ్మణపల్లి, సోమారం, నందివాడ తదితర గ్రామాలలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్లపై తిరిగే వారిపై దాడులు చేసి గాయ పరచడంతో ఆస్పత్రి పాలవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలు ఇలా..పాములు వస్తే ఎలా..?



అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు

బాన్సువాడ రూరల్: బుడిమి గ్రామ జెడ్పీహైస్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వర్షాకాలం కావడంతో ప్రాంగణంలో గడ్డి, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి క్రిమికీటకాలకు ఆవాసంగా మారాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తుంటారు. పాములు కేంద్రంలోకి వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రం చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధ్వానంగా కాడ్లాపూర్ తండా రోడ్డు



కంకర తేలిన కాడ్లాపూర్ తండా రోడ్డు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రానికి సుదూరంగా ఉన్న కాడ్లాపూర్ తండాకు వెళ్లే రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారింది. ఎగువ ప్రాంతంలో గట్టుపై నుంచి వస్తున్న వరదనీటితో రోడ్డు కోతకు గురవుతోంది. తండాకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదే రోడ్డులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్డును పునర్నిర్మించాలని తండాప్రజలు కోరుతున్నారు.

అంబులెన్స్ రాదు.. ఫైరింజన్ వెళ్లదు



రోడ్డుకు అడ్డంగా ఉన్న మరుగుదొడ్డి

బాన్సువాడ రూరల్: మండలంలోని మొగులాన్‌పల్లి తండాలోని ఓ వీధిలో సీసీ రోడ్డుకు అడ్డంగా ఓ మరుగుదొడ్డి ఉంది. రెండువైపులా నుంచి రోడ్డు వచ్చి మరుగుదొడ్డి వద్ద ఆగిపోయింది. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తండాలో ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్స్ కాని ఫైరింజన్‌కాని తండా చుట్టూ తిరగలేని పరిస్థితి నెలకొంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తండావాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై అడ్డంగా ఉన్న మరుగుదొడ్డిని తొలగించి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించారు

సాక్షి ఎఫెక్ట్..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రథ్‌గల్లీలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. సాక్షి దినపత్రికలో సోమవారం 'తాగునీటి సమస్యను పరిష్కరించండి' అని వచ్చిన కథనానికి మద్నూర్ జీపీ కార్యదర్శి సందీప్ స్పందించారు. సమస్యను గుర్తించి మరమ్మతులు చేయించారు. కుళాయిల ద్వారా నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మదర్సా పాఠశాల ఆవరణలో మురికి నీరు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈనెల 7న సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పాఠశాల ఆవరణలో మురికి నీరు నిలవకుండా కాలువను తవ్వించారు. 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

బాన్సువాడ రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు డిమాండ్ చేశారు. సోమవారం బాన్సువాడలో మాట్లాడారు. విద్యారంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని,4 ఏళ్ల నుంచి రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. యాజమాన్యాలు ఫీజు కడితేనే టీసీలు ఇస్తామంటున్నారని అన్నారు.

ఎరువులను తక్కువ మోతాదులో వాడాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్వేత

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తమ పంట పొలాల్లో రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడాలని తహసీల్దార్ శ్వేత అన్నారు. తాడ్వాయి రైతు వేదిక కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. యూరియా కొరత ఉందని ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం ఏవో నర్సిములు మాట్లాడుతూ.. గత సంవత్సరం కన్నా ఈ యేడాది ఎరువులు అధికంగా వచ్చాయన్నారు. అధికంగా యూరియా వాడడం వల్ల కత్తెర పురుగులు వ్యాపిస్తాయన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, కార్యదర్శి నర్సింలు, ఏఈవో శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో బీఆర్‌ఎస్ బాన్సువాడ ఇన్‌చార్జి ప్రకటన



కేటీఆర్‌తో బాన్సువాడ నాయకులు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నియామకంపై పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని, 2 రోజుల్లో పేరు ప్రకటించనున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమకు హామీ ఇచ్చినట్లు ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో బాన్సువాడ కార్యకర్తలు, నేతలు కేటీఆర్‌ను, మాజీ మంత్రి హరీష్‌రావును వేర్వేరుగా కలుసుకున్నారు. నాయకులు ఎర్రవట్టి సాయిబాబా, బోడ రాంచందర్, కుర్మ గంగారాం, మార్గం శ్రీనివాస్, శంకర్, లక్ష్మణ్, భూమన్న పాల్గొన్నారు.

మోరీని మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేటలోని 6వ వార్డులో జీపీకి సంబంధించిన మోరీని అక్రమంగా మూసేసినవారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారికి ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో 2002లో మురికికాలువను నిర్మించారని, కాలనీకి చెందిన సలీంపాష, వసీంపాష మోరీని మూసివేసి మెట్లను నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తగుచర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

సమాచారం..

నేడు 'విద్యుత్' సమస్యల పరిష్కార వేదిక

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మంగళవారం పిట్లం మండలంలోని విద్యుత్ ఉప కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఈ ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ చైర్ పర్సన్ రామకృష్ణ రానున్నారు..పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

పంటలు, కలుపుపై వీడియో కాన్ఫరెన్స్

కామారెడ్డి అర్బన్/ఎల్లారెడ్డి రూరల్: వానా కాలం పంటలు- కలుపు యాజమాన్యంపై మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని కామారెడ్డి ఏఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, దేవేంద్ర, తేజస్విని, ఎల్లారెడ్డి మండల అధికారులు తెలిపారు. అనంతరం రైతుల ప్రశ్నలకు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు జవాబులు ఇస్తారని, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏఈవోలు కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వనమహోత్సవం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం నిర్వహించే వనమహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్లు ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. ఆయనతో పాటు స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, ఇతర ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం అరికటికె సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే పోచారం పాల్గొననున్నారు.

నూతన కార్యవర్గాల ఏర్పాటు

పద్మశాలి సంఘం మండల కార్యవర్గం



భిక్కనూరు పద్మశాలి సంఘం కార్యవర్గం

భిక్కనూరు: మండల కేంద్రంలో మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోగ్రీగల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా ఎల్లారపు తిరుపతి, మెరుగు రాజలింగం, సబ్బని మల్లేషం, కైరంకొండ కృష్ణహరి, ప్రధాన కార్యదర్శిగా కుడిక్యాల ఏక్‌నాథ్, సహాయ కార్యదర్శులుగా కై రంకొండ భిక్షపతి, కుచని సిద్ధరాములు, కోశాధికారిగా జోగ్రీగల జీవన్, ముఖ్య సలహదారులుగా సామల మధు, మామిడి పుండరీకం, బల్ల బాల్‌లింగం, కొండం రాజేందర్, రేగొండ నాగరాజు లు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిని సన్మానించారు.

సదాశివనగర్ కార్యవర్గం..



సదాశివనగర్‌లో సంఘం కార్యవర్గ సభ్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడాల శ్రీనివాస్(వాసు), ప్రధానకార్యదర్శిగా జొగ్రీగల నర్సయ్య, కోశాధికారిగా చౌకి రాజు, ఉపాధ్యక్షులుగా చౌకి కిషన్, మార సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా తన్నీరు ఎల్లయ్య, సబ్బని విశ్వనాథం, ప్రధాన సలహాదాలుగా సందీప్, ముఖ్య సలహాదారులుగా చింత కింది సత్యం, ఊడం ప్రవీణ్, మామిడి రాజేశ్, రాములు, కార్యవర్గ సభ్యులుగా అంకం సతీశ్, ఏశాల శ్రీనివాస్, జొగ్రీగల రాజశేఖర్, దీకొండ శ్రీధర్, రాజేందర్‌లు ఎన్నికయ్యారు. మాజీ మండలాధ్యక్షుడు బిట్ల శంకర్ సంఘానికి చెందిన లావాదేవీల నూతన కమిటీకి అప్పగించారు.

టీజీవీపీ మండల నూతన కార్యవర్గం



నియామక పత్రం అందజేస్తున్న గంధం సంజయ్

భిక్కనూరు: తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) భిక్కనూరు మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవుని భరత్ రాజు, ఉపాధ్యక్షుడిగా రాయలపురం కార్తిక్, కమిటీ సభ్యులుగా రంజిత్, మనోజ్, కైఫ్, బన్నీ, చరణ్, నరేష్, సందీప్, కార్తిక్, భానుచందర్‌లు ఎన్నికయ్యారు. వీరందరికి టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్ ధ్రువీకరణపత్రాలను అందజేశారు. కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సమీర్ పాల్గొన్నారు.

ఏబీఎస్‌ఎస్ మండల కార్యవర్గం



నియామక పత్రాన్ని అందజేస్తున్న నేతలు

రాజంపేట: ఆలిండియా బంజార సేవ సంఘ్ మండల నూతన కార్యవర్గాన్ని రాజంపేటలో సోమవారం ఏకగీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముడావత్ గణేష్, ఉపాధ్యక్షులుగా కేలోత్ జైసింగ్, చౌహాన్ వస్రాం, ప్రధాన కార్యదర్శిగా సభావత్ పండరి, సహాయ కార్యదర్శులుగా రామావత్ శివకుమార్, మాలోత్ బల్‌రాంలు, కోశాధికారిగా కేతావత్ రవి, సలహాదారులుగా దేవిసింగ్ నాయక్, చందర్ నాయక్, రాజానాయక్, బాల్యానాయక్, కిషన్ నాయక్, విఠల్ నాయక్, తౌర్య నాయక్‌లు ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంల పంపిణీ

గాంధారి(ఎల్లారెడ్డి): జువ్వాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం పలువురు నాయకులు, గ్రామ పెద్దల చేతుల మీదుగ ఉచిత నోటుపుస్తకాలు, స్కూల్‌యూనిఫార్మ్‌లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం ప్రకాశ్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హెచ్‌ఎం కోరారు.

వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పీహెచ్‌సీలో సోమవారం జిల్లా మానసిక వైద్య నిపుణుడు రమణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. ఎంవో దివ్య, సీహెచ్‌వో నాగరాజు, రాహుల్ పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో..

రాజంపేట: ఆర్గొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందుల అందజేశారు. ఎంఈవో పూర్ణచందర్ రావ్, వైద్యులు హరీష్, దివ్యభారతి, ఏఎన్‌ఎం నీరజ, స్వప్న పాల్గొన్నారు.

తాడ్వాయిలో ..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలో ఎన్‌సీడీ శిబిరాన్ని నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గ్రామంలో తిరుగుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధడుతున్నవారిని గుర్తించి, వారికి వైద్య పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎం సాబేరా బేగం, ఆశవర్కర్ జ్యోతి తదతరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ..పలువురికి జరిమానాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ వద్ద సోమవారం ఎస్సై దీపక్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు వసూలు చేసి..పలువురికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. వాహనాల్లో గంజాయి, గుట్కాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్సై మధుసూదన్, కానిస్టేబుల్ రాజు, మురళి, జయ్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బోనాల ఉత్సవాలు

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో జరిగిన మహంకాళి బోనాల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చీరలను వేలం వేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సిద్దారెడ్డి, గౌరవ అర్చకులు కృష్ణమూర్తి శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



భిక్కనూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రభుత్వం నిర్ణయించడంతో భిక్కనూరు మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ బీసీ విభాగం ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, కాంగ్రెస్ మండల బీసీ విభాగం అధ్యక్షుడు వడ్ల తిర్మల్ స్వామి, నేతలు లింబాద్రి, నీల అంజయ్య, గజ్జె సురేష్, సాజిద్ పాల్గొన్నారు.